ఆవిడ నిద్దర్లోంచి మేలుకున్నట్టు వులిక్కిపడి అమ్మవంక చూసింది.

"తిరుపతిదా - పోతుండాము" అన్నాడు తమలపాకులు, పచ్చివక్క నోట్లో వేసుకుని బంగారు పళ్ళాయన.

తమలపాకులు బాగా నమిలి, సీట్లోంచి కిటికీవైపుకి వెళ్ళి, కిటికీలోంచి తుపుక్కున వుమ్మాడు. ఆసీట్లోనే పేపరు వెనక మొహం దాచుకున్నాయనమీద తుప్పర్లు పడ్డాయి గాలి విసురుకు. పేపరు వెనక తలకాయ బయటకొచ్చింది. తీక్షణంగా చూసే ఆయన కళ్ళల్లోకిచూసి - చంటిపిల్లాడిలా బంగారుపళ్ళు బయట పడేటట్టు పకపక నవ్వి;

"ఏమిటిదా చేసేది. తంబాగు లేందిదా బండి నడవదు. కాతుదా అట్టావచ్చింది. చూసిరా లేదు-" అన్నాడు.

తలకాయ పేపరు వెనక్కి వెళ్ళిపోయింది.

"కాతంటే ఏమిటే" అంది అమ్మ.

"కాతు - అంటే గాలి అని అర్థం" అన్నాను.

"ఏమ్మా - పెరియమ్మా - మీరుదా ఎక్కడికిపూడుస్తారు. ఆమె మీ బిడ్డా" అన్నాడు అమ్మవైపు తిరిగి.

"అవును. నాయనా, కూతురూ అల్లుడూ. తిరపతి మొక్కుకు వెళ్తున్నాం" అంది అమ్మ.

"వా-యింకేం. మనమంతా ఒకేతావుకిపూడుస్తుము. ఓయింటాపే, వింటావా? వీరువా మనతో తిరపతిదా వస్తాండిరి" అన్నాడు వుత్సాహంతో భార్యవైపుతిరిగి.

"అవును దాఅమ్మా, మాఅప్పుడా తెలుంగుదారా స్త్రి. నీంగళ తెలుంగుదా నాకు పట్టను." అన్నాడు నవ్వుతూ.

తిరువళ్లూరు వచ్చింది. పేపరు వెనక మనుషులు దిగి పోయారు.

"దామీ. రాండిమీ. కూచుకో" అని మా వారిని కూచోబెట్టి, తలుపుదగ్గిర నుల్చుని, కంపార్టుమెంటులోకి ఎవ రినీ రాకుండా చేశాడు బంగారు పళ్ళాయన.

రైలు కదిలింది. పొన్నుపిళ్ళై (మాకు తర్వాత చెప్పా డులెండి పేరు) భార్యవైపు తిరిగి, "ఆ బిడ్డలకు తినెందుకుదా వెయ్యిమీ" అన్నాడు.

ఆవిడ వంగి పలహారాల బుట్ట పైకితీసింది. వడలూ, పెరుగూ అన్నం, కోవాబిళ్ళలూ తీసి ఆకుల్లో పెట్టి పిల్లలందరికీ యిచ్చింది. పెద్దపిల్ల వద్దంది. నావంక తిరిగి "చూస్తివా - చూస్తివామ్మా అటదా చేస్తుంది. కడుపుకు తిననంటుందే. నా తలరాత. చూడిమీ ముట్టనే ముట్టను. కోపంచేస్తినా గమ్మునుంటుంది. అంతదా. తినదమ్మా—" అంటూ నాకో ఆకు అందించబోయింది. నే వద్దన్నాను.

"వో యిటాపె, నీకుదా తెలియదా. వారు అయ్యంగారుదానా. ఎట్టతింటరూ. పళ్ళువత్తియియ్యిమీ ఆ బిడ్డకు-ఆ పడుచువానికి యియ్యిమీ" - అన్నాడు పుక్కిలించి నీళ్ళు వుమ్మేస్తూ పిళ్ళైగారు.

బత్తాయి పండ్లూ — అరటిపళ్లూ యిచ్చిందావిడ. బత్తాయిపండు పెద్దకూతురికి యివ్వబోతే వద్దంది.

